ప్రజాశక్తి

బుధవారం 17 జనవరి 2024

5

పార్వతీపురం మన్యం

20న ఐటిడిఎ ఎదుట నిరసన

గుమ్మలక్ష్మీపురం: ఈ నెల 20న పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయి బాబు, ఆరిక ప్రభాకరరావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, గిరిజన కళాశాల వసతి గృహాలకు, ఎఎన్ఎంలను నియమించాలనే డిమాండ్‌తో నిరసన చేపడుతున్నామని అన్నారు. గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలకు ఒక్కరు చొప్పున, ఏకలవ్య పాఠశాలలకు ఇద్దరు చొప్పున ఎఎన్ఎంలను నియమించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతి గృహాలకు ఎఎన్ఎంలను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. మన్యం జిల్లాకు చెందిన గిరిజన ప్రజా ప్రతినిధులు డిప్యూటీ సిఎం రాజన్నదొర, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఎఎన్ఎంల నియామకం ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు.

పల్లెల్లో కనుమ సందడి

సంక్రాంతి పండగ సందర్భంగా కనుమను పురష్కరించుకుని పల్లెలన్నీ కళకళలాడాయి. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు సాయంత్రం ఇసుక తిన్నెలపై ఆటపాటలతో సందడి చేశారు. పండగ సందర్బంగా మూడు రోజులూ పలు గ్రామల్లో వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. సీతానగరంలో సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా పూర్వ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం రెడ్డివానివలసలో సిపిఎం ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించారు. పండగ సందర్భంగా కురుపాం మండలంలోని దొంతి కొండకు జనం పోటెత్తారు. పార్వతీపురం మండలంలోని వింజమ్మతల్లి మెరక పండగలను ఘనంగా చేపట్టారు.

ప్రజాశక్తి- సీతానగరం

ప్రజల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు పండుగలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. తన స్వగ్రామం బూర్జలో సంక్రాంతి వేడుకలను కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో ఆయన సరదాగా జరుపుకున్నారు. అందరూ నూతన వస్త్రాలు, సంప్రదాయ వస్త్ర ధారణలో కను విందు చేస్తూ ఆట పాటలతో సందడి చేశారు. చిన్నారులతో సరదాగా గడిపారు. ఇళ్ళ ముంగిట్లో వేసిన ముగ్గులు, రంగవల్లికలను తిలకించారు. సంక్రాంతి పండుగ సంప్రదాయ అర్థం కలిగించే ముగ్గులు పరిశీలించి వారిని కొనియాడారు. పిల్లలకు వాటి విశిష్టతను వివరించారు. అందరూ వారి బాల్య స్మృతులను గుర్తు చేసుకొని స్నేహపూర్వకంగా మెలిగారు. పండుగల్లో పూర్వ కాలం నుండి తయారు చేస్తున్న పిండి వంటకాలు మన ఆరోగ్యానికి ఎంతో మంచిదని అందుకే మన పూర్వీకులు,పెద్దలకు ఆరోగ్య సమస్యలు అంతగా ఉండేవి కావని ప్రతీ ఒక్కరూ ఇటువంటి ఆహారపు అలవాట్ల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.

సీతానగరం: ఇసుక తెన్నులపై సందడి చేస్తున్న ప్రజలు

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కనుమ పండుగను ఘనంగా చేసుకున్నారు. సువర్ణముఖి నది సమీపంలో ఉన్న గ్రామాలు గెడ్డలుప్పి, సీతానగరం, లక్ష్మీపురం, బుర్జ గ్రామాల ప్రజలు ఇసుక దిబ్బలకు వచ్చి కొత్త అల్లుళ్ళు, కొత్త కోడళ్ళ తో పలు ఆటలు ఆడుకున్నారు. కొత్త పరిచయాలతో సందడి సందడిగా జరిగింది.

గుమ్మలక్ష్మీపురం: కబడ్డీలో తలబడుతున్న మహిళలు

దొంతి కొండకు పోటెత్తిన సందర్శకులు

కురుపాం : సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణాల నుండి పల్లెలకు వచ్చిన వారు మండలంలో మొండెంఖల్లు గ్రామంలో ఉన్న దొంతి కొండకు వేల సంఖ్యలో చేరుకుని మంగళవారం సాయంత్రం సందడి చేశారు. గిరిజన గ్రామాలకు ముఖ ద్వారంగా ఉన్న మొండెంఖల్‌లో రెండు కొండలు దొంతి కొండలు ఆకారం ఉంటూ చుట్టూ ఆహ్లాదకర వాతావరణ చూడడానికి ప్రత్యేకంగా కనువిందు చేస్తుంటుంది. దీంతో మండలంలో వివిధ గ్రామాల నుండి ఆనవాయితీగా అక్కడకు వచ్చే సందర్శిస్తుంటారు. కొండల నడుమ వెలిసిన నీలమ్మ తల్లిని దర్శనం చేసుకుంటారు. ఇది ఏటా సంక్రాంతి, కనుమ రోజున ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

గుమ్మలక్ష్మీపురం: పల్లెల్లో సంక్రాతి పండుగను ప్రజలు ఆనందోత్సవాల నడుమ సందడిగా జరుపుకున్నారు. మండలంలోని మూల జమ్ము గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో యువతి, యువకులు, మహిళాలు కబడ్డీ, కుర్చీ ఆట, తాడు ఆట, పాటల పోటీలు నిర్వహించారు. తాడికొండ జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. గిరిజన గ్రామాల్లో సాంస్కృక కార్యక్రమాలను నిర్వహించారు. జియమ్మవలస మండలంలోని పెద్దబుడ్డిడి గ్రామంలో బంధువులు అంత కలసి వంటలు చేసి సహపంతి భోజనాలు చేశారు. తప్పెటగుళ్ళు, కోలాటం నిర్వహించారు. గ్రామానికి సమీపంలో ఉన్న గల్లీ తోట వద్ద యాత్రకు పిల్లలు, పెద్దలు వెళ్లి సందడిగా గడిపారు.

వేడుకగా వింజమ్మతల్లి మెరక పండుగ

పార్వతీపురంరూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం కనుమ పండగ సందర్బంగా పార్వతీపురం మండలంలోని పలు గ్రామాల్లో మేరక పండగలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. పలు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద పండగ కోసం తమ తమ గ్రామాలకు చేరుకున్న వారు కనుమ రోజు నాడు ఊరి శివారులో ఉన్న మెరకకు చేరుకొని భారీ జన సందోహం మధ్య ఒకరినొకరు పలకరించుకుంటూ ఆప్యాయతలను వలకబోస్తూ ఆనందంగా గడిపారు. ఈ క్రమంలో మండలంలోని తాళ్ళబురిడి గ్రామంలో గ్రామానికి చెందిన యువజన సంఘం నిర్వహించిన వింజమతల్లి కొండ పండుగను వేడుకగా నిర్వహించారు. భారీ ఎత్తున గ్రామస్తులు హాజరై తమ చిన్ననాటి మిత్రులను కలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర స్థానిక నాయకులు బేత లక్ష్మణరావు, బుడితి శ్రీరామ్, శ్రీధర్ తదితరులతో కలిసి వింజమ్మతల్లి నుంచి దర్శించుకుని ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని నర్సిపురం గ్రామంలో గ్రామ శివారులో నిర్వహించిన మెరక పండగలో పెద్ద ఎత్తున గ్రామస్తులు హాజరై ఆనందంగా గడిపారు.

కురుపాం: దొంతి కొండపై పర్యాటకుల సందడి

మృతదేహాన్ని డోలీకి కట్టి తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

చిట్టెంపాడులో విషాదం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని మూల బొడ్డవర పంచాయతీలో హృదయ విదాకరణమైన సంఘటన చోటు చేసుకుంది. గిరి శిఖర గ్రామం చిట్టెంపాడు గిరిజనులు అనారోగ్యం బారినపడితే డోలీ మోతలే వారికి గత్యంతరం అవుతున్నాయి. వారికి రహదారి సదుపాయం లేకపోవడంతో వారి ప్రాణాలు గాలిలోనే కలిసిపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 57ఏళ్లవుతున్నా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేకపోవడంతో గ్రామంలో నిత్యం మరణాలు సంభవిస్తున్నాయి.

చిట్టెంపాడు గ్రామానికి చెందిన మాదల గంగమ్మ, తన ఆరు నెలల చంటిబిడ్డ తీవ్ర అనారోగ్యం బారిన పడడంతో ఈనెల 5న భర్త గంగులు తోటి గిరిజనుల సహాయంతో వారిని డోలీలో ఏడు కిలోమీటర్లు మోసుకుంటూ బొడ్డవర వరకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచి 108 వాహనంలో వైద్యం కోసం శృంగవరపుకోట పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా విశాఖ కెజిహెచ్‌కు తల్లీ బిడ్డను రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరు నెలల పసిపాప ఈనెల 7న మృతి చెందింది. గంగమ్మ కూడా పరిస్థితి విషమించి మంగళవారం కన్ను మూసింది. ఈనేపథ్యంలో గంగమ్మ మృతదేహాన్ని ప్రైవేటు వాహనంలో మండలంలోని బొడ్డవర వరకు తీసుకొచ్చి వదిలేయడంతో బొడ్డవరం నుంచి ఆమె భర్త గంగులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొడ్డవర రైల్వే స్టేషన్ వరకు ద్విచక్ర వాహనం మధ్యలో మృతదేహాన్ని పెట్టి తీసుకువెళ్లాడు. అక్కడినుంచి డోలీపై ఏడు కిలోమీటర్లు గిరి శిఖర చిట్టెంపాడు గ్రామానికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహించాడు. ఈఘటన స్థానికులను తీవ్రంగా కలిసివేసింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. డోలి మోతలపై ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించి రహదారి నిర్మాణానికి రూ. 10కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

గంగమ్మ మృతదేహం వద్ద రోధిస్తున్న భర్త

రెడ్డివాని వలసలో ఆటల పోటీలు

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని రెడ్డివానివలసలో మాజీ డివైఎఫ్ఐ నాయకులు, ప్రజా పోరాటాల యోధుడు రెడ్డి శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం ఆటల పోటీలను నిర్వహించారు. వాలీబాల్ పోటీలను ఉమ్మడి జిల్లాలో ఎస్ఎఫ్ఐ నాయకులు, ప్రజా తంత్ర ఉద్యమ నాయకులు రెడ్డి వేణు, రెడ్డి శంకర్రావు ప్రారంభించారు. రెడ్డి వానివలసలో ముగ్గులు, రన్నింగ్, టగ్ ఆఫ్ వార్, డాన్స్ పోటీలు, స్లో సైక్లింగ్, నిమ్మకాయ వాకింగ్, అండ్ రన్నింగ్ తదితర ఆటలు నిర్వహించారు. అన్ని ఆటలకి ప్రథమ, ద్వితీయ ఆకర్షణీయమైన బహుమతులను ప్రధానం చేశారు. ప్రజా సంఘాల, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, శ్రామిక మహిళా సంఘం నాయకులు ఇందిరా, యుటిఎఫ్ నాయకులు జి నిర్మల, రెడ్డి శంకర్రావు, రెడ్డి వేణు, గ్రామ నాయకులు, పెద్దలు, రెడ్డి ప్రభాకర్, అప్పారావు, రెడ్డి నాయుడు, రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మణ్ నాయుడు, రెడ్డి రవణమూర్తి బహుమతులు అందజేశారు.

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గ్రామాల్లో జోరుగా కోడిపందేలు

ఎస్‌కోట: తలబడుతున్న కోళ్లు

ప్రజాశక్తి-శృంగవరపుకోట, సాలూరు

సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలోని పలుచోట్ల జోరుగా కోడిపందేలు సాగాయి. పండగ మూడు రోజులూ యథేచ్ఛంగా పందేలు జరగ్గా, లక్షలాది రూపాయలు బెట్టింగ్‌లు జరిగాయి. ఎస్.కోట మండలంలోని పెద్దకండేపల్లి. ఆలుబిల్లి, వసి తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా కోడి పందేలను సాగించినప్పటికీ పోలీసులు జాడ కాన రాలేదు. కోడిపందాలు నిర్వహించకూడదని హైకోర్టు ఆదేశించిన ఎక్కడా ఆ ఆదేశాలు పనిచేయలేదు.

సాలూరు మండలం మామిడిపల్లి, తోణాం, గంగదొరవలస తదితర చోట్ల కోడిపందేలు జోరుగా సాగాయి. గజపతినగరం, మెంటాడ మండలాల్లోని చంపావతి నది అవతల గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి.

సాలూరు రూరల్: పోటీకి సిద్ధమైన పుంజులు

లోకేష్‌ను కలిసిన వీరేష్

ప్రజాశక్తి - కురుపాం

నూతనంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితమైన కురుపాం నియోజకవర్గ టిడిపి యువ నాయకులు వైరచర్ల వీరేష్ చంద్రదేవ్ మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్ తనపై నమ్మకాన్ని ఉంచి టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు వారిని కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాననీ చెప్పారు. వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి శక్తివంతన లేకుండా కృషి చేస్తానన్నారు.

పండగలోనూ ఆగని పోరాటం

పార్వతీపురం: ఎమ్మెల్యేకు వినతినిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీల హక్కుల సాధన కోసం దీక్ష చేపట్టి మంగళవారానికి 36వ రోజు అవుతున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించకపోవడంతో దీక్షా శిబిరం వద్ద వినూన్నత రీతిలో గంగిరెద్దుకు తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ల జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమార్, ప్రాజెక్టు కార్యదర్శి జె.సరోజ, సెక్టర్ లీడర్లు ఎం. మీనాక్షి, డివి రత్నం, బి. జయలక్ష్మి, ఎస్. సులోచన, డి. జ్యోతిలక్ష్మి, ఎన్. సుమతి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ఎదుట సోమవారం అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా తీపి వంటకాలు చేసి నిరసన తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు పాలక సాంబయ్య సమ్మెకు సంఘీ బావం తెలిపారు. ఈ కార్యక్రమంలో విఒఎ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైన అంగన్వాడీ సంఘంతో చర్చలు జరిపి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు కోలాటం ద్వార నిరసన తెలిపారు. సమ్మె శిబిరంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు సురేష్, ఎం.కాంతారావు, ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్మమి, అంజలి, ప్రియ, అయెవతి, కుమారి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: గుంజీలు తీస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సీతానగరం: మండల కేంద్రంలో 36వ రోజు అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. పండగ పూట కూడా కుటుంబ సభ్యులను బంధువులను ఇంటి వద్ద విడిచిపెట్టి అంగన్వాడీలు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. ఈ కార్య క్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, అంగన్వాడీ యూనియన్ నాయుకులు మరిచర్ల సునీత, అనురాధ, కుమారి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరితే అంగన్వాడీ ఆడపడుచులకు పండుగను దూరం చేసిన గుండె లేని బండరాయి ప్రభుత్వమని జిల్లా అంగన్వాడీల యూనియన్ కార్యదర్శి గంట జ్యోతి, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, వాకాడ ఇందిరా, అంగన్వాడి నాయకులు రాజేశ్వరి, గౌరీ, మని అన్నారు. తమ డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెలో భాగంగా 36వ రోజు మంగళవారం పార్వతీపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంక్రాంతి, కనుమ పండగలను లెక్కచేయకుండా నిరసన శిబిరాన్ని కొనసాగించారు. ప్రోజెక్ట్ లీడర్స్ గౌరీ మణి, అలివేలు అధ్వర్యంలో సంక్రాంతి పిండి వంటలు చేశారు. ఈసందర్భంగా అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సందర్శించగా, వారికి నాయకులు తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేసి సమ్మె పరిష్కారానికి చర్చలకు పిలవాలని కోరుతూ వినతి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమ్మె విరమించాలని అంగన్వాడీలను కోరారు. జీతాల పెంపు అంశాలపై జీవో ఇస్తే సమ్మె విరమిస్తామనీ అంగన్వాడీలు, సిఐటియు నాయకులు ఎమ్మెల్యేకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలక రంజిత్ కుమార్, సెక్టార్ లీడర్స్ కే.రాజేశ్వరి, బి.శాంతి, ఎమ్.గౌరీ, సరస్వతి, కవిత, నాగ సులోచన తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: డిప్యూటీ సీఎం

సాలూరు: అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ సీఎం రాజన్నదొర హామీ ఇచ్చారు. ఆదివారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆద్వర్యాన కార్యకర్తలు హెల్పర్లు డిప్యూటీ సీఎం రాజన్నదొరని ఆయన నివాసంలో మంగళ వారం కలిసి సమస్యలు వివరించారు.

గుంజీలు తీస్తూ నిరసన: 36వరోజు సమ్మెలో భాగంగా సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరసన శిబిరం వద్ద గుంజీలు తీస్తూ నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు ఎ.నారాయమ్మ, శశికళ అద్వర్యాన కార్యకర్తలు హెల్పర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతమ్మ, సుభద్ర, సుజాత పాల్గొన్నారు.

కొమరాడ: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న సమ్మె 36వ రోజు మండల కేంద్రంలో జరిగింది. మంగళవారం 36వ రోజు క్రిస్మస్ ప్రార్థన పాస్టర్ ద్వారా టెంటలో చేస్తూ అనంతరం

సీతంపేట: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గోమాతకు ప్రత్యేక పూజలు అరటిపళ్ళు బూరెలు తినిపిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షులు సిరిక అనురాధ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ సమ్యలను పరిష్కరించేంత వరకూ పోరాటం చేస్తారన్నారు. పండగ పూట కూడా పోరాటం చేస్తున్నారంటే వారి సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ లీడర్లు అలివేలు, జ్యోతి, పద్మ, జయమ్మ, మల్లేశ్వరమ్మ, విస్తరాని, ఎస్ రాధా, ఎస్ వసంత, బి భవాని, బి రాణి, ఎం కాంతమ్మ, సుజాత, కొమరాడ మండల తెలుగు రైతు అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఏ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: గంగిరెద్దుకు వినతినిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



చెక్‌ను అందిస్తున్న కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

పివిటిజిల అభివృద్ధి

కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

ప్రజాశక్తి- సీతంపేట

పివిటిజిల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని చేపడుతుందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ అన్నారు. పివిటిజి గిరిజనులతో సోమవారం ప్రధాన మంత్రి వర్చువల్‌గా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీతంపేట ఐటిడిఎ నుంచి కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘవాల్ పాల్గొని మాట్లాడారు. పిఎం జన్‌మన్ కార్యక్రమం ద్వారా పివిటిజి గిరిజనులకు పక్కా ఇల్లు, గ్రామానికి తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఉపాధి, పోషణ, అంగన్వాడీ భవనాలు వంటివి మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గిరిజనులు వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఇప్పటికే చాలా గిరిజన గ్రామాలకు రహదారి, తాగునీటిని అందించామని గుర్తు చేశారు. అనంతరం గిరిజన సంస్కృతిని తెలిపే సవర ఆర్ట్స్ చిత్రపటాన్ని పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల జాయింట్ కలెక్టర్‌లు కేంద్ర మంత్రికి బహుకరించారు. కార్యక్రమానికి ముందు గిరిజన నేత బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఎం. నవీన్, ఆర్. గోవిందరావు, పాలకొండ ఆర్‌డిఒ లావణ్య, శ్రీకాకుళం డిఎంహెచ్‌ఒ మీనాక్షి, పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు, ఎపిఒ రోషిరెడ్డి, డిఎం జిసిసి సంధ్యారాణి, పిహెచ్‌ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ, తహశీల్దార్ నర్సింహమూర్తి, సిడిపిఒ రంగలక్ష్మి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్, అన్ని శాఖల శాఖాధిపతులు, ఐటిడిఎ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

క్రికెట్ విజేత వీరఘట్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రాయవలస గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు గుంట్రెడ్డి అప్పలనాయుడు, చిన్నమ్మి, పప్పల దశరథ్ జ్ఞాపకార్థం స్థానిక జెడ్పి స్కూల్ ఆవరణంలో ఈ నెల 6 నుంచి నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వీరఘట్టం జట్టు విజయం సాధించింది. ఈ పోటీల్లో పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాలకు సంబంధించిన 32 టీమ్‌లు పాల్గొని తలబడ్డాయి. మొదటి బహుమతి సాధించిన వీరఘట్టం టీమ్‌కు రూ. 10వేలతో పాటు ట్రోపిని ఎంపిటిసి కోట భరత్ చేతుల మీదుగా అందించారు. రన్నర్‌గా ఫ్రెండ్స్ యూత్ జట్టు విజయం సాధించింది. ఈ జట్టుకు రూ. 5వేలు, ట్రోపిని అందించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీష్‌గా వీర కట్టమూరుకు చెందిన అనీష్, బెస్ట్ బ్యాట్స్‌మాన్‌గా తిరుమల, బెస్ట్ బౌలర్‌గా ఎం. మహేష్, బెస్ట్ ఫీల్డర్‌గా జి. సంతోష్, బెస్ట్ వికెట్ కీపర్‌గా జి శ్యామ్ నిలిచారు. ఈ కార్యక్రమంలో గుంటూరు వెంకట్ నాయుడు, శ్రీనివాసులు, సినిమా ప్రొడ్యూసర్ జి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జయకృష్ణ

కిండంగిలో 'పల్లె పిలుస్తోంది'

ప్రజాశక్తి- సీతంపేట

పల్లె పిలుస్తుంది రా కదలిరా సంక్రాంతి సంకల్పంలో భాగంగా కిండంగి గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం గ్రామంలో టిడిపి మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మక కాంతారావు, పాలక ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాంసదం దుకాణం వద్ద ఎగబడుతున్న జనం

రద్దీగా మాంసం, చేపల దుకాణాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో మాంసం దుకాణాలు రద్దీతో కిటకిట లాడాయి. కనుమ పండగను పురస్కరించుకుని మంగళవారం తెల్లవారి నుండి మాంసం, చేపల దుకాణాలు రద్దీగా కనిపించాయి. ఈ ఏడాది మాంసప్రియులు ఇష్టంగా తినే రోజు అయిన మంగళవారం నాడు కనుమ పండుగ బుధవారం నాడు ముక్కనుమ పడడం ఆయా వ్యాపారస్తులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం సాగిందనే చెప్పవచ్చు. సాధారణ రోజులలో 1 కేజీ 800 రూపాయలు ఉండే గొర్రె మాంసం పండగ సందర్భంగా వెయ్యి రూపాయలకు, 1 కేజీ 150 రూపాయలు విక్రయించే చేపలు పండగ సందర్భంగా 200 రూపాయల అధిక ధరలకు సంబంధిత వ్యాపారులు విక్రయాలు సాగించినా విక్రయాల్లో మాత్రం ఊపు తగ్గలేదు.

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతు ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు 1989 పదో తరగతి పూర్వ విద్యార్థులు తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అప్పటి విద్యార్థులందరూ ఒకచోట కలిసి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మే ఏడో తేదీన గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందులో భాగంగా గురువులకు గౌరవించడం, ఆత్మీయ కలయిక వంటి విషయాలు చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో బి రామారావు, సింహాచలం, సురేష్, ఆండాలు అనంతు, సింహాచలం, కృష్ణ, శ్రీకాంత్, ప్రసాదు, గౌరీ, ప్రసాద్, అనంతు, బ్రహ్మాజీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్తు

బొబ్బిలి రూరల్: కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని మెరైన్ ఇంజినీర్ గేదెల అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.బూర్జవలస ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు, యువతకు చదువు-ఉపాధి అవకాశాలుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి, క్రమశిక్షణతో చదివితే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, అబ్దుల్ కలాం యూత్ అసోసియేషన్ సభ్యులు బి.గణపతిరావు, కె.చంద్రశేఖర్, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

'జ్ఞాపకాల పొరల్లోంచి' పుస్తకావిష్కరణ

- గంటేడ స్వగ్రామంలో కార్యక్రమం నిర్వహణ
- తల్లి సోములమ్మకు పుస్తకాన్ని అంకితం చేసిన రచయిత

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం మన్యం జిల్లాలో కథ, కవిత్వం, పాట, పద్యం అన్ని ప్రక్రియల్ని సమర్థవంతంగా నిర్వహించగలిగిన ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడు రచించిన 'జ్ఞాపకాల పొరల్లోంచి' (ఫేస్ బుక్ సీరియల్) పుస్తకావిష్కరణ సంక్రాంతి పండుగనాడు రచయిత స్వగ్రామంలో దళాయిపేటలో జరిగింది. పాడుదమా స్వేచ్ఛాగీతం గీతరచయితగా ఖ్యాతి గడించిన గంటేడ స్నేహకళాసాహితీను స్థాపించి ఉత్తరాంధ్ర నుంచి ఎందరో కవుల్ని, కథకుల్ని తయారు చేసిన ఘనత ఆయనకే స్వంతం. జాతీయ, రాష్ట్రీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు, సన్మానాలు, సత్కారాలు, రివార్డులు అందుకున్న ఘనత ఆయనకే దక్కుతుంది. అటువంటి గౌరునాయుడు తానుపుట్టి 70 సంత్సరకాలంలో తన జ్ఞాపకాలను 70అంశాలను కథలుగా రాసి పది కాలాలపాటు పదిలపరచుకునేల అక్షరబద్ధంచేశారు. ఆయనతండ్రి సత్యం ప్రచురణలుగా నాగేటి చాలుకు నమస్కారం (దీర్ఘ కావ్యం),

గౌరినాయుడు తల్లిని సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

సేద్యగాడు (పద్యాలు), నేడు మూడో పుస్తకంగా తల్లిసోములమ్మ 90ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జ్ఞాపకాలు పొరల్లోంచి పుస్తకాన్ని ఆవిష్కరించి తల్లికి అందజేసారు. తన స్వగ్రామంలో తల్లి సోములమ్మ, కుటుంబసభ్యులు, తన స్నేహితుల మధ్య సంక్రాంతి పండుగ నాడు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని రచయిత గంటేడ గౌరునాయుడు తెలిపారు. ఆయన రాసిన యాస భాషకు శ్వాస, నాబాల్యం, మా సిద్ధాంతి, బీడీ సత్యం, బడి, పూలరంగడు మా సోమలింగం మేస్టారు, గుంప యాత్ర, మాతృ ప్రేమ, బుర్రకథ, పోడుమంట, నవోదయ గ్రంథాలయం, భయపెట్టిన నందుగాడి మిమిక్రీ, జాలారి భాగోతం, కవిత్వంతో ఒక సాయంత్రం, పాట మరణించదు, నాగావళి నది వంతెన, ఊరి చివరి ఇల్లు తదితర అంశాలపై రాసిన కథలపై అందరి అభిప్రాయాలని రచయితతో ముచ్చటించుకున్నారు. ఈ కార్యక్రమంలో గంటేడ చిన్నంనాయుడు, గౌరీశ్వరి, జానకమ్మ, శ్రీలంకి త్రినాథరావు మాస్టారు, పోల మధుసూధనరావు, దనుకొండ చంద్రశేఖరరావు, పిన్నింటి నారాయణమ్మ, పార్వతమ్మ, భారతమ్మ, సందీప్ హరిణి ,శ్రావణీ, లావణ్య,స్వప్న, కిరణ్, క్రాంతి, వివేక్, రోజారమణి, మానస, లహరి, భాను, కార్తీక్, మంతిని తిరుమల, రాజేష్, యమున, సాయి, సంతోష్, అనన్య, పల్లవి, కుందన, సాహిల్, సమర్, అరుణ సాగర్, వాన బ్రదర్స్, గంటేడ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఆడారు గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు సోమవారం టిడిపి పాలకొండ నియోజకవర్గం బాధ్యులు నిమ్మక జయకృష్ణ స్వగ్రామమైన ఎం రాజపురం గ్రామంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆడారు గ్రామస్తులు మాట్లాడుతూ వైసిపి విధానాలు నచ్చకపోవటం వల్ల ఆ పార్టీని వీడి టిడిపిలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, మాచర్ల అనిల్, సోడి నారాయణరావు, గాంధీ, సింహాచలం, కోష్టి ఎల్లయ్య, గురుమూర్తి, జమ్మల ఈశ్వరరావు, గౌరీ, సింహాచలం, పి వెంకటరమణ, బలిజ సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో జయకృష్ణ

టిడిపి శ్రేణుల్లో అయోమయం

- ఎమ్మెల్యే అభ్యర్థి పై కొనసాగుతున్న ఉత్కంఠ
- జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం

ప్రజాశక్తి -సాలూరు

నియోజకవర్గ టిడిపి శ్రేణుల్లో అయోమయం నెలకొంది. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణితో పాటు కొత్తగా మరో గిరిజన మహిళా నాయకులు ఎం.తేజోవతి ఎమ్మెల్యే సీటును ఆశిస్తున్నారు. సంధ్యారాణి గడిచిన ఐదేళ్లుగా నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. టికెట్ తనకే వస్తుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ గ్రూపు నాయకులు తేజోవతిను తెరపైకి తెచ్చారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం కోసం నాయకులు, కార్యకర్తలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. పార్టీకి అన్ని మండలాల నాయకులను కలుపుకుని పోవడంలేదనే కారణంతో కొంతమంది మండల నాయకులు సంధ్యారాణిని వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త అభ్యర్థిని రంగంలోకి దించితే ఉన్న తక్కువ సమయంలో జనంలోకి నెట్టుకు రాగలమా లేదా అని అధిష్ఠానం తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలుస్తోంది.

జనసేనకే కేటాయిస్తారనే ప్రచారం

టిడిపి, జనసేన పార్టీల మధ్య పొత్తులో భాగంగా నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం కూడా మరోవైపు జరుగుతోంది. ఒకవేళ జనసేనకు కేటాయిస్తే టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏ మేరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది. రాష్ట్ర స్థాయి లో జనసేన, టిడిపి నాయకుల మధ్య ఉన్నంత బలంగా సంబంధాలు నియోజకవర్గ స్థాయిలో కనిపించడం లేదు. నియోజకవర్గ స్థాయిలో కూడా టిడిపికి ఉన్నంత సమర్థ నాయకత్వం జనసేనకు లేదు. టిడిపిలో నెలకొన్న గ్రూపు రాజకీయాల తలనొప్పి కారణంగా ఆ పార్టీ నాయకత్వం జనసేనకు కేటాయిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. అధికారపార్టీపై ప్రజా వ్యతిరేకత ఉన్నప్పటికీ దాన్ని సొమ్ము చేసుకునే పరిస్థితిలో ప్రతిపక్ష నాయకులు లేకపోవడం, ఇంటి పోరును చక్కదిద్దుకోలేకపోవడం కూడా వారికి మైనస్ పాయింట్‌గా కనిపిస్తోంది. ఏమైనా తాజా పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులను అయోమయానికి గురి చేస్తోంది.

అన్నార్తులకు ఆపన్నహస్తం

ప్రజాశక్తి- సాలూరు

మానవ సేవే మాధవ సేవ అన్న ఆర్యోక్తికి నిలువెత్తు నిదర్శనం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త కోడూరు సాయి శ్రీనివాసరావు. ఒకవైపు తన దైనందిన జీవితంలో తన కార్యకలాపాలను నిర్వహించుకుంటూ నిరుపేద అన్నార్తుల కోసం రోజూ కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రతిరోజూ తన వాహనం పై పట్టణంలోని నిరుపేద అభాగ్యులకు మధ్యాహ్నం పూట భోజనం పంపిణీ చేస్తున్నారు. పట్టణంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన అన్నార్తులకు రోజూ మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తున్నారు. సమితి అందిస్తున్న భోజన క్యారేజ్‌లను ఆయన తన వాహనంపై తీసుకెళ్ళి నిరుపేద మహిళలకు, వృద్ధులకు అందజేస్తున్నారు. గత అనేక సంవత్సరాలుగా కోడూరు సాయి శ్రీనివాసరావు మాష్టారు ఈ కార్యక్రమాన్ని నిరాటంకంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 గంటలకు ఆయన భోజనం క్యారేజ్‌లను తీసుకెళ్ళి అభాగ్యులకు అందజేస్తారు. గతంలో పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మాదేటి సూర్యారావు తన కారులో వెళుతూ అభాగ్యులకు మధ్యాహ్నం భోజనం అందజేసే వారు. ఆయన మరణానంతరం సాయి శ్రీనివాసరావు మాష్టారు ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. పట్టణంలో ఓ ప్రయివేటు పాఠశాలను నడుపుకుంటున్న సాయి శ్రీనివాసరావు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజా మన్ననలను పొందుతున్నారు.

వాహనంపై భోజనం తీసుకెళ్తున్న సాయి

కారు చీకట్లో బైపాస్ రోడ్డు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో ఉన్న బైపాస్ రోడ్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల దీపాలు గత కొన్ని రోజులుగా వెలగడక పోవడంతో రోడ్డు అంధకారంగా మారింది. దీనికితోడు ఈ రహదారి మొత్తం ఎక్కడపడితే అక్కడ గోతులు ఏర్పడి రహదారి అధ్వానంగా మారింది. ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహరదారులు, భారీ వాహన చోదకులు ప్రయాణం చేయాలంటే తమ వాహనాల లైట్లు వెలుగులోనే ప్రయాణం చేయవలసి పరిస్థితి. ఈ రహదారి గుండా నడక సాగించే పాదచారుల పరిస్థితి మరి చెప్పనక్కరలేదు. ఏ వాహనం తన మీదకు వస్తుందోనని భయపడుతూనే నడక సాగించవలసిన పరిస్థితి వస్తుంది. జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న బైపాస్ రోడ్డు విద్యుత్ స్తంభాల లైట్లు గురించి సంబంధిత అధికారులు

చీకటిగా ఉన్న ప్రధాన రహదారి

పట్టించుకోక పోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని స్థానికులు బహిరంగంగానే అధికారులను విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా బైపాస్ రోడ్‌లో ఏ ప్రమాదం జరగకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాల లైట్లు పునరుద్ధించాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- బలిజపేట

మండంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు సమక్షంలో మంగళవారం నిరు పేదలకు దుప్పట్లు, డబ్బులు పంపిణీ చేశారు. పండగ సందర్భంగా గ్రామానికి చెందిన కీర్తి శేషులు చీకటి చిన్న నారాయన కుమారులు చీకటి గోపాల్‌నాయుడు, లక్ష్మణ్ నాయుడు, కీర్తి శేషులు చీకటి నారాయణ నాయుడు కుమారుడు చీకటి అప్పలనాయుడు, కీర్తి శేషులు చీకటి శ్రీరాములునాయుడు కుమారుడు చీకటి అప్పలనాయుడు గ్రామంలో 100 మంది నిరు పేదలకు దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు మాస్టారు, చీకటి సింహాచలం, నేరళ్ల భూషణ్, మాదాసి రాము, కోట గౌరీనాద్, బొద్దాన వెంకట రమణ, పెంకి పరశు రామ్, ఆర్ఎంపి డాక్టర్ మచ్చ శ్రీను, గొర్రెల శ్రావణ్, మర్రాపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవనాయుడును సత్కరిస్తున్న నిర్వాహకులు

సాలూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం స్థానిక పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆద్వర్యాన పేదలకు వస్త్రదానం చేశారు. సంఘం అద్యక్షుడు ఇండుపూరి నారాయణరావు, నాయకులు అవ్వా రమేష్‌లు పట్టణంలోని పేదలకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా సంఘం అద్వర్యాన పేదలకు వస్త్రదానం చేయడం సాంప్రదాయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధ్వాన్నంగా రోడ్లు... గాల్లో ప్రాణాలు

- వీధిన పడుతున్న కుటుంబాలు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రధాన రహదారులు గోతులమయంగా ఉండడంతో గత కొంతకాలం నుంచి తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో అనేకమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. కుటుంబ పెద్దదిక్కే కోల్పోడం వల్ల ప్రమాదాల బారిన పడి మృతి చెందిన వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. మండలంలోని వీరఘట్టం - పాలకొండ ప్రధాన రహదారిలో శ్రీవెంకట బాలాజీ సమీపాన గత ఏడాది డిసెంబర్ 21న చిదిమి గ్రామ సచివాలయంలో విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్న వై.రాజారావు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయన విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వీరఘట్టం వస్తుండగా వెంకట బాలాజీ రైస్ మిల్ వద్దకు వచ్చేసరికి రహదారిపై ఉన్న గొయ్యిని తప్పించేందుకు ప్రయత్నించగా వీరఘట్టం నుండి పాలకొండ వైపు కారు బలంగా వస్తూ ఢీకొనడంతో బలమైన గాయాలు తగలడంతో మృతి చెందాడు. నవంబర్ 8న స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఎదురెదురుగా వచ్చి రెండు లారీలు ఢీకొనడంతో ఎటువంటి ప్రమాదం సంభవించలేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఎదురెదురుగా ఢీ కొన్న లారీలు (ఫైల్)

మరమ్మతులు గురవుతున్న వాహనాలు

మండల కేంద్రంలోని గత ఏడాది అక్టోబర్ 20న అంబేద్కర్ జంక్షన్ వద్ద గల భారీ ట్యాంకర్ రాడ్డు ఇరిగి పోవడంతో వందలాది వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇదే నెల 23న తెలగ వీధి జంక్షన్‌లో లారీ బ్రేక్ రాడ్ ఇరిగిపోయింది.

గోతులమయమైన ప్రధాన రహదారి

గతేడాది డిసెంబర్ 6న వీరఘట్టంలోని మిత్ర జంక్షన్ వద్ద పార్వతీపురం నుంచి వచ్చిన లారీ డివైడర్లను ఢీకొనడంతో లారీ మొదటి టైర్లు రాడ్డు విరిగిపోయింది. ఈ ఏడాది జనవరి 10న తెలగ వీధి మలుపు వద్ద గల పాలకొండ నుంచి వచ్చిన వస్తున్న లారీ బ్రేక్ రాడ్ ఇరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. వీరఘట్టం ప్రధాన రహదారి నిర్మాణ పనులు ఏళ్ల గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో తరచుగా వాహనాలు పాడైపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి రహదారులు మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

పడకేసిన ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు

- జైకా నిధులున్నా.. పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- రైతులకు సకాలం అందని సాగునీరు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు పడకేశాయి. సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరణ చేసి రైతులకు సంపూర్ణంగా సాగునీరు ఇచ్చేందుకు జైకా నిధులు మంజూరై ఐదేళ్లు గడిచినా ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడంతో ఆధునీకరణ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు.

సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు నత్తనడకన సాగడంతో రైతులకు సకాలంలో సాగునీరు అందడం లేదు. సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న సాలూరు, మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాల రైతులకు సాగునీరు అందించే వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు ఆధునీకరణకు జైకా నిధులు రూ.48.89కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.10కోట్లు విలువ చేసే పనులను మాత్రమే కాంట్రాక్టర్ పూర్తి చేశారు. కాంట్రాక్టర్ కు ప్రభుత్వం రూ.3.76కోట్లు బిల్లులు చెల్లించగా ఇంకా రూ.6.27కోట్లు చెల్లించాల్సి ఉంది. బిల్లులు చెల్లించకపోవడంతో పనులను కాంట్రాక్టర్ నిలిపివేసి టెండర్‌ను రద్దు చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరినట్లు సమాచారం. విఆర్ఎస్ ఆధునీకరణ పూర్తి కాకపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. బొబ్బిలి మండలం శివారుగా ఉండడంతో నీరు అందే పరిస్థితి లేక రైతులు వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురిస్తుంది. సీతానగరం మండలంలో ఉన్న పెద్ద అంకలాం ఆనకట్ట ఆధునీకరణకు రూ.14కోట్లు మంజూరవ్వగా రూ. కోటి 5లక్షల విలువైన పనులు చేశారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ కు రూ.65లక్షలు బిల్లులు చెల్లించగా ఇంకా రూ.49లక్షలు చెల్లించాల్సి ఉంది. వీటి పనులను కూడా చేయలేమని, టెండర్ రద్దు చేయాలని కాంట్రాక్టర్ కోరుతున్నట్లు తెలిసింది. వట్టిగెడ్డ ఆధునీకరణకు రూ.39.24కోట్లు మంజూరవ్వగా ఇప్పటి వరకు రూ.3.90 కోట్లు పనులు పూర్తి చేశారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు రూ.2.60 కోట్లు బిల్లులు చెల్లించగా ఇంకా రూ.1.30 కోట్లు బకాయి ఉంది. పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.23.83కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.6.20 కోట్లు పనులు పూర్తి చేశారు. కాంట్రాక్టర్ కు రూ.4.80 కోట్లు బిల్లులు చెల్లించగా ఇంకా రూ.1.40కోట్లు చెల్లించాల్సి ఉంది. టెండర్ ను రద్దు చేయాలని కాంట్రాక్టర్ కోరుతున్నట్లు తెలిసింది.

బొబ్బిలిలోని పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయం

రైతులకు సక్రమంగా అందని సాగునీరు

వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు గేట్లు

సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు జరగకపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు సక్రమంగా పండడం లేదని రైతులు వాపోతున్నారు. జైకా నిధులతో షెటర్ల మరమ్మతులు, సాగునీటి కాలువలలో పూడికలు తొలగించాల్సి ఉన్నప్పటికీ జరగలేదు. దీంతో షెటర్లు పాడైపోయి నీరు వృథాగా పోతుంది. కాలువలలో పూడికలు పేరుకుపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందే పరిస్థితి లేదు. వర్షాలు అనుకూలించకపోతే పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైకా నిధులతో సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు పూర్తి చేసి పంటలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

అమెరికాలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని ఎన్ఎస్ఎస్ కాలనీకి చెందిన విద్యార్థి రాకోటి సాయి నికేష్ (21) అమెరికాలో మృతి చెందాడు. అక్కడ హాక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో ఉన్నత చదువులకు వెళ్లిన సాయి నికెష్ మృతి చెందినట్లు మంగళవారం ఇక్కడికి సమాచారం అందింది. బిటెక్ వరకు ఇక్కడే చదువుకొని ఉన్నత చదువులకు వెళ్ళాడు. తండ్రి రమణ వ్యాపారి, తల్లి ఆదిలక్ష్మి గృహిణి. రూమ్‌లోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

బంగారు దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధి 22వ వార్డులోని వరహాల గడ్డ వీధి పక్కనే ప్రధాన రహదారికి ఆనుకోని ఉన్న శ్రీదుర్గా జ్యూయలర్స్ దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు జ్యూయలరీ యజమానురాలు కందికుప్పల శ్యామలాదేవి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పట్టణ సిఐ కృష్ణారావు ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐ సంతోషికుమారి పోలీస్ సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రాంతానికి చేరుకొని పరిశీలించి బాధితురాలను విచారించగా లక్ష రూపాయలు విలువచేసే వెండి పట్టీలు, సామాన్లు చోరీకి గురయ్యాయని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.